
సాక్షి
ములుగు
శనివారం । 26 । జూలై । 2025



గోదావరికి వరద తాకిడి..

మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత నీటితో గోదావరికి వరద తాకిడి పెరిగింది. - 8లో▸



అధ్వానం.. ఎంజీఎం అత్యవసర విభాగం

వైద్య అధికారుల నిర్లక్ష్యంతో వరంగల్ ఎంజీఎం అత్యవసర విభాగం నిత్యం వివాదాస్పదంగా మారుతోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/26^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉమ్మడి వరంగల్ స్పెషలాఫీసర్‌గా శశాంక



సాక్షిప్రతినిధి, వరంగల్ : ఉమ్మడి వరంగల్ స్పెషలాఫీసర్‌గా ఐఏఎస్ అధికారి కె.శశాంక నియమితులయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించిన ప్రభుత్వం ఉమ్మడి వరంగల్‌కు 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శశాంక పేరును ప్రకటించింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఆయన గతంలో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. ఇటీవల ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి కమిషనర్‌గా నియమించిన ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ స్పెషలాఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలోని మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్, ట్యూటర్ పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రొఫెసర్- 06, అసోసియేట్ ప్రొఫెసర్ -17, సీనియర్ రెసిడెంట్-39, ట్యూటర్ -04 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. మెడికల్ కళాశాల, అనుబంధ ఆస్పత్రిలో పని చేయడానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 01, 02వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం https// gmcmulugu. org వెబ్‌సైట్ సందర్శించాలని కోరారు.

పీఏసీఎస్ కార్యాలయం తనిఖీ



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘాన్ని జిల్లా సహకార అధికారి మాలోత్ సర్దార్‌సింగ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల బస్తాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎరువుల బస్తాల సరఫరా గురించి సీఈఓ స్వాతిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరికీ ఎరువులను పంపిణీ చేయాలన్నారు. ఎరువుల పంపిణీలో రైతులను ఇబ్బందులకు గురి చెయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్‌గౌడ్, డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, రంగరబోయిన జగదీశ్, సిబ్బంది ఉన్నారు.

ఎరువుల షాపు తనిఖీ

ఏటూరునాగారం: మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాన్ని జిల్లా సహకార సంఘం అధికారి సర్దార్‌సింగ్ శక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ఎరువులు విక్రయించారా.. లేదా.. అని పరిశీలించారు. ఎరువుల లోడ్‌తో ఎంత యూరియా నిల్వ వచ్చింది.. ఎంత విక్రయించారని రికార్డుల ద్వారా తెలుసుకున్నారు. మరో లోడు యూరియా వస్తుందని, అర్హులైన రైతులకు మాత్రమే అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ గౌరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కూనూరు అశోక్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల ఎంపిక

ములుగు రూరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ అండర్ 8, 10, 12, 14, 16, 18, 20సంవత్సరాల లోపు బాలబాలికలు, పురుషులు, మహిళల ఎంపిక పోటీల్లో పాల్గొన్నాలని అసోసియేషన్ సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారు ఆగస్టు 03, 04 తేదీల్లో హనుమకొండలోని జేఎన్ఎస్‌లో తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జావెలిన్‌త్రోలో ఎంపికైన వారు ఆగస్టు 07వ తేదీన జనగామ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 09 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

ఇందిరమ్మకు చేయూత

లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ రుణాలు



- రూ.50వేల నుంచి రూ.2 లక్షల వరకు లోన్
- ముమ్మరంగా నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

మంగపేట: ఇల్లు లేని పేదలకోసం ప్రభుత్వం ఇందిరమ్మ పథకం పేరుతో ఇళ్లను మంజూరు చేయడంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. సొంతింటి కల సాకారం అవుతుండడంతో ఆయా కుటుంబాలు సంబురపడుతున్నాయి. జిల్లాలో 9 మండలాలతోపాటు నూతనంగా ఏర్పడిన మల్లంపల్లిలో కలిపి మొత్తం 5,000 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరి చేసింది. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన గ్రామాల్లో పనులు 50 నుంచి 75 శాతం వరకు పూర్తికావచ్చాయి.

లబ్ధిదారులకు ఎంసీపీ రుణాలు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన మహిళా స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని సభ్యులు ఇంటి నిర్మాణం కోసం రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు ఎంసీపీ(మైక్రో క్రెడిట్ ప్లాన్) ద్వారా బ్యాంక్ లింకేజీ రుణాలు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసుకుని సంఘ సభ్యుల తీర్మానం మేరకు బ్యాంకు నుంచి రూ.లక్ష అప్పు తీసుకున్న లబ్ధిదారు రూపాయి వడ్డీతో ప్రతి నెలా రూ.4,000 చొప్పున 29 నెలలు చెల్లించే అవకాశం కల్పించారు. దీంతో ప్రభుత్వం ఇళ్ల మంజూరు చేయడంతోపాటు ఇంటి నిర్మాణానికి బ్యాంకులో రుణం తీసుకుని సులబ పద్ధతిలో అప్పు చెల్లించే వెసులుబాటు కల్పించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా సాగుతున్న నిర్మాణ పనులు

దశాబ్దాల కాలం నుంచి పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక పూరిగుడిసెలు, రేకుల షెడ్లలో జీవనం సాగిస్తున్న నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలతోపాటు అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని అమలులోకి తెచ్చి అభయాన్ని ఇచ్చిందని లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మంజూరు పత్రాలను పొందిన లబ్ధిదారులు వర్షాకాలం అయినప్పటికీ త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి కొత్త ఇంటిలో చేరాలనే ఆశతో బ్యాంక్ లింకేజీ రుణాలు తీసుకుని పనులను చేయిస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వం లబ్ధిదారులకు బిల్లులు సైతం చెల్లిస్తుండంతో ఆయా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

లబ్ధిదారులకు అవగాహన

ఇందిరమ్మ పథకం అమలులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా జనాభా ప్రతిపాదికన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి గ్రామ సభల ద్వారా ఇళ్ల మంజూరు పత్రాలను అందచేశారు. ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు సంబంధిత అధికారులు ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో 400 నుంచి 430 స్క్వేయర్ ఫీట్ల స్థలంలో ఇంటి నిర్మాణం నిబంధనలు, బిల్లుల చెల్లింపులపై అవగాహన కల్పించారు. నిర్మాణ పనులను ప్రారంభించి 45 రోజుల్లో పూర్తి చేసుకోవాలని సూచించారు.



పూరేడుపల్లిలో స్లాబ్ లెవల్‌లో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

జిల్లాలో వివిధ బ్యాంకుల నుంచి లింకేజీ రుణాలు పొందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారులు	రుణగ్రస్తులు	రుణం(రూ.లో)
మంగపేట	564	126	1,35,65,000
ఏటూరునాగారం	285	95	97,00000
కన్నాయిగూడెం	282	73	49,10,000
వెంకటాపురం(కె)	387	83	61,55,000
వాజేడు	838	159	13,00000
ఎస్ఎస్ తాడ్వాయి	510	59	47,97,000
గోవిందరావుపేట	464	115	1,22,10,000
వెంకటాపురం(ఎం)	270	122	1,31,20,000
ములుగు, మల్లంపల్లి	675	142	1,34,70,000

కాంగ్రెస్ పార్టీ, మంత్రి సీతక్క మేలు మరువలేం



కాంగ్రెస్ ప్రభుత్వం పుణ్యం, మంత్రి సీతక్క చొరవతో సొంతింటి కల నేరవేరింది. ఇల్లు కట్టు కునేందుకు ఆర్థిక స్థోమత లేక పదేళ్ల క్రితం నుంచి పూరిగుడిసెలో ఉంటున్నాం. ఊహించని విధంగా ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది. ఇల్లు నిర్మించుకునేందుకు పొదుపు సంఘం ద్వారా రూ.లక్ష రుణం ఇచ్చారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంటి పనిచేయిస్తున్నాం. సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ పార్టీకి, మంత్రి సీతక్కకు రుణపడి ఉంటాం.

- చందా రజిత, లబ్ధిదారు, బాలన్నగూడెం

అర్హులందరికీ లింకేజీ రుణాలు



మహిళా పొదుపు సంఘాలకు ఎంసీపీ ద్వారా ఇచ్చే బ్యాంక్ లింకేజీ రుణాలను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇస్తున్నాం. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు పొందిన లబ్ధిదారులు ఆనందంగా ఇంటి పనులు చేస్తున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి రుణం ఇస్తాం. లబ్ధిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలి.

- సంపత్‌రావు, అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ

శ్రావణ శోభ

శ్రావణ మాసం ఆరంభంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల కోలాహలం కన్పించింది. ఇళ్లలో పూజలు చేసిన మహిళలు, సమీపంలోని ఆలయాల్లోనూ మొక్కులు చెల్లించి సల్లంగచూడు తల్లీ అంటూ అమ్మవారిని వేడుకున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప రామలింగేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెలరోజుల పాటు ఆలయాలు భక్తులు, ప్రధానంగా మహిళలతో కిటకిటలాడనున్నాయి.

- సాక్షి నెట్‌వర్క్



శ్రావణమాసం తొలిశుక్రవారం సందర్భంగా రామప్ప రామలింగేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ టీఎస్ దివాకర



మల్లంపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో మందులను పరిశీలిస్తున్న కలెక్టర్

ములుగు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ టీఎస్ దివాకర సూచించారు. మల్లంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వపు ప్రాథమిక విద్యను అందించాలని సిబ్బందికి సూచించారు. కేంద్రాల్లో నెలవారీ సెలబస్‌ను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. టీచింగ్ లెర్నింగ్ మెటిరియల్ ఉపయోగించి చిన్నారులకు విద్యా బోధన చేపట్టాలని అన్నారు. క్రమం తప్పకుండా చిన్నారుల ఎత్తు, బరువులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కేంద్రానికి వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంపై అడిగి తెలుసుకున్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను ఆస్పత్రికి రెఫర్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ తుల రవి, సీడీపీఓ శిరిష, సూపర్‌వైజర్ కమురునిసాబేగం, అంగన్‌వాడీ టీచర్లు మల్లికాంబ, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి

సీజనల్ వ్యాధులు వాప్తి చెందకుండా అరికట్టాలని కలెక్టర్ దివాకర అన్నారు. మల్లంపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వలను పరిశీలించారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుందని నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. విధుల్లో వైద్యులు నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే జ్వరపీడితులకు ఏఏ పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రానికి ప్రజలు ఎక్కువగా ఎలాంటి సమస్యలతో వస్తున్నారనే వివరాలపై ఆరా తీశారు. ఆశా కార్యకర్తలు ఫీవర్ సర్వే చేపట్టాలని అన్నారు. దోమల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. డాక్టర్ శ్రవణ్‌కుమార్, ఆయుష్ డాక్టర్ సంధ్య, ఫార్మసిస్టు ఉషారాణి, ఆరోగ్య కార్యకర్తలు మంజుల, వసంత, ఆశా కార్యకర్తలు సుధారాణి, రేణుక, రజిత, సుజాత పాల్గొన్నారు.

రాతపరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ మహేందర్‌జీ



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌జీ

ములుగు రూరల్: ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న గ్రామ పరిపాలన అధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్ స్క్రీనింగ్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాలలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పరిపాలన అధికారి పరీక్షకు 26 మంది అభ్యర్థులు హాజరవుతారని అన్నారు. లైసెన్స్ సర్వేయర్ రాత పరీక్ష, ప్రాక్టికల్స్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంటల వరకు, 02 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పనులు, మంచినీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు ఎలాంటి ఎల్క్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దని సూచించారు. పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం, కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ శివకుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొండాయి వద్ద పడవలో ప్రయాణిస్తున్న ప్రజలు



ములుగు రూరల్: లో లెవల్ వంతెన పై నుంచి ప్రవహిస్తున్న బొగ్గులవాగు



పెరుగుతున్న గోదావరి

- వాగుల్లో తగ్గని వరద ఉధృతి
- కరకట్ట గేట్లు మూసివేత

ఏటూరునాగారం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రామన్నగూడెం వద్ద గోదావరి నది క్రమంగా పెరుగుతోంది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద శుక్రవారం సాయంత్రం 12.50 మీటర్ల నీటిమట్టంతో గోదావరి ప్రవహిస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు. అంతేకాకుండా గోదావరి శనివారం సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరే అవకాశం ఉండడంతో ఇరిగేషన్ అధికారులు కరకట్టకు ఉన్న షట్టర్లను శుక్రవారం సాయంత్రం మూసివేశారు. వరద నీరు గ్రామాల్లోకి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

పడవ ప్రయాణమే దిక్కు..

మండలంలోని కొండాయి వద్ద బ్రిడ్జి లేకపోవడంతో కొండాయి, మల్యాల, కొత్తూరు, ఐలాపురం గ్రామాల ప్రజలు పడవలోనే ప్రయాణించి జంపన్నవాగును దాటుతున్నారు. ముసురుగా వర్షాలు పడుతుండడంతో వాగు ఉధృతి తగ్గలేదు. అలాగే ఎలిశెట్టిపల్లి వద్ద పడవల ద్వారా ప్రజలను, రైతులను దాటిస్తున్నారు. మండల కేంద్రానికి 17 కిలోమీటర్ల దూరంలో ఎలిశెట్టిపల్లి, కొత్తూరు గ్రామాలు ఉండడంతో జంపన్నవాగు ఉధృతి వల్ల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పడవలను వినియోగించుకొని అవసరాలను తీర్చుకుంటున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న బొగ్గులవాగు

ములుగు రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని సర్వాపూర్-జగ్గన్నగూడెం గ్రామాల మధ్యలోని బొగ్గుల వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శుక్రవారం బొగ్గుల వాగు లో లెవల్ వంతెన పైనుంచి ప్రవహించింది. దీంతో ప్రజలు వాగు దాటకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఇక.. భూసేకరణ వేగవంతం

మామునూరు విమానాశ్రయంపై సర్కారు నజర్

- తాజాగా 253 ఎకరాల కోసం రూ.205 కోట్లకు పాలనాపరమైన అనుమతులు
- విమానాశ్రయానికి 50 శాతం మందికిపైగా రైతులు అంగీకారం
- మరో రూ.112 కోట్లు అత్యవసరం



సాక్షి, వరంగల్: మామునూరు విమానాశ్రయం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇందులో భూములు కోల్పోతున్న నిర్వాసితులతో పరిహారం విషయమై ఇప్పటికే డిస్ట్రిక్ట్ లెవెల్ ల్యాండ్ నెగోషియేషన్ కమిటీ చర్చించింది. వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.1.20 కోట్లు, వ్యవసాయేతర భూములకు చదరపు గజానికి రూ.4,887గా నిర్ణయించింది. పాత ఎయిర్ స్ట్రిప్‌నకు చెందిన 696 ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆధీనంలో ఉంది. ఈ రన్‌వే విస్తరణ కోసం అదనంగా అవసరమయ్యే 253 ఎకరాల భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.205 కోట్లు కేటాయించింది. అందుకు శుక్రవారం పరిపాలన అనుమతులను మంజూరు ఇవ్వడంతో ఇక భూసేకరణ వేగవంతం కానుంది. కాగా, 50 శాతంమందికి పైగా మంది రైతులు తమ కన్సెంట్ (అంగీకార పత్రం) తెలపడంతో ఎలాంటి అడ్డంకులు లేకుండానే భూసేకరణ జరుగుతుందని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు రూ.205 కోట్లు కేటాయించిన జీఓ ఆధారంగా ఇప్పుడు బడ్జెట్ కేటాయించారంటున్నారు.

మూడు జిల్లాలను అనుసంధానించేలా...

కేంద్రం ఉడాన్ పథకం కింద 2022 సెప్టెంబర్‌లో మామునూరు విమానాశ్రయాన్ని ఎంపిక చేసింది. నిజాం కాలంలోని ఈ విమానాశ్రయంలో ఎయిర్ స్ట్రిప్ అందుబాటులో ఉండేది. అక్కడ 1400 మీటర్ల పొడవైన రన్ వే, గ్లైడర్స్ దిగేందుకు మరో చిన్న రన్‌వే ఉంది. ఈ రన్ వే విస్తరణకు అదనంగా 253 ఎకరాల భూసేకరణ అవసరం. ముఖ్యంగా వరంగల్ చేరుకోవాలంటే హైదరాబాద్ దిగి మూడు గంటలు ప్రయాణం చేయాల్సి ఉంది. ఇది పెట్టుబడులకు ఆటంకంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వరంగల్‌లోనే నేరుగా ల్యాండ్ అయ్యే అవకాశం ఉంటే వేగంగా పెట్టుబడులు వస్తాయని భావించింది. అలాగే, ఉత్తర తెలంగాణలో మరో ముఖ్య పట్టణమైన కరీంనగర్‌తోపాటు ఖమ్మం, నల్లగొండ జిల్లాల ప్రజలు మామునూరు విమానాశ్రయం నుంచే రాకపోకలు సాగించేలా రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం వరంగల్-కరీంనగర్ మధ్య 80 కిమీ మేర ఎన్‌హెచ్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. వరంగల్ -ఖమ్మం నేషనల్ హైవే ప్రస్తుత రద్దీకి అనుగుణంగా లేదు. నల్లగొండ జిల్లా ప్రజలను ఓరుగల్లుతో అనుసంధానించేందుకు వరంగల్-దంతాలపల్లి-సూర్యాపేట వరకు రెండు వరుసల ఎన్‌హెచ్ ఉంది. దీన్ని నాలుగు వరుసలుగా విస్తరించాల్సి ఉంది. అలాగే, వరంగల్ నుంచి 15 కిమీ దూరంలో ఉన్న మామునూరుకు వరంగల్, హనుమకొండ, కాజీపేట నుంచి రేడియల్ రోడ్లు నిర్మించాలి. నగర ఇన్నర్, ఔటర్ రింగురోడ్లను ఎయిర్‌పోర్టుతో అనుసంధానిస్తారు.

మరో రూ.112 కోట్లు అవసరమే..

విమానాశ్రయ నిర్మాణానికి నక్కలపల్లి, గాడిపల్లి, గుంటూరుపల్లిలో 240 ఎకరాల వ్యవసాయ భూమి, సుమారు 13 ఎకరాల (61,134.5 చదరపు గజాల) వ్యవసాయేతర భూమి సేకరించాల్సి ఉంది. వ్యవసాయ భూమికి రూ.288 కోట్లు, వ్యవసాయేతర భూమికి రూ.29,87,61,858 భూనిర్వాసితులకు చెల్లించాలి. మొత్తంగా రూ.317 కోట్లు అవసరం అవుతుండగా.. మరోదఫా ప్రభుత్వం రూ.112 కోట్లు అవసరం. భూసేకరణ పూర్తయి, ఎయిర్‌పోర్ట్ ప్రారంభమైతే 150 నుంచి 186 మంది ప్రయాణించే ఏ-320, బీ-737 విమానాలు రాకపోకలు సాగించనున్నాయి.

పర్యాటకం, ఐటీ పరిశ్రమలకు బూస్ట్..

- మామునూరు ఎయిర్‌పోర్ట్ ప్రారంభమైతే కొచ్చిన్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ మాదిరిగానే భద్రాచలం, రామప్ప, లక్నవరం, మేడారానికి భక్తులు, సందర్శకులు పెరుగుతారు.
- టైర్ 2 పట్టణాల్లోనూ ఐటీ విస్తరణలో భాగంగా ఎయిర్‌పోర్ట్ కీలకంగా మారనుంది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని కైటెక్స్ మాదిరిగానే మరిన్ని అంతర్జాతీయ వ్యాపారసంస్థలు ముందుకు వస్తాయి. దీంతో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కే అవకాశముంది.
- మామునూరు సమీప ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం పెరుగుతుంది.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కన్నాయిగూడెం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జీసీడీఓ రమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీని రమాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలపై ఆరా తీశారు. గదిలో నిల్వ ఉంచిన కూరగాయలు, పప్పులు, పండ్లను పరిశీలించారు. నాణ్యమైన, తాజా పదార్థాలను అందించాలన్నారు. అనంతరం తరగతిగదిలో విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, విద్యపై ఆరా తీశారు. సిబ్బంది రిజిస్టర్లను పరిశీలించిన అనంతరం రమాదేవి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు, ప్రభుత్వం ఇస్తున్న మెనూ ప్రకారం భోజన వసతి కలిపించాలన్నారు. అనుమతి లేకుండా సిబ్బంది విధులకు గైరాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. పాఠశాల ప్రత్యేక అధికారి అశ్విని పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ములుగు డీపీఓ దేవరాజ్

వెంకటాపురం(ఎం): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఒంటేరు దేవరాజ్ పేర్కొన్నారు. ఎంపీడీఓ రాజు, ఎంపీఓ శ్రీనివాస్‌తో కలిసి మండల కేంద్రంలో చేపడుతున్న శానిటేషన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. హెల్త్ సబ్‌సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ పనులు చేపడుతున్నట్లు వివరించారు. గ్రామాల్లోని అంతర్గత రహదారులపై నీరు నిలవకుండా డ్రెయినేజీలను ఎప్పటికపుడు సిబ్బందిచే శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రామప్ప సరస్సును సందర్శించి సరస్సు నీటిమట్టంతోపాటు తూముల పరిస్థితిని పరిశీలించామన్నారు. పర్యాటకులు చెరువులోకి దిగకుండా అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. డీపీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు రేవతి, చందూలాల్, కారోబార్ వెంకటరమణ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



రామప్ప సరస్సును పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

దాశరథిని స్ఫూర్తిగా తీసుకోవాలి



మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

విద్యారణ్యపురి: తెలంగాణలో నిజాం పాలనాకాలంలో దాశరథి కృష్ణమాచార్య పోరాట పటిమ ఎంతో గొప్పదని, సమాజ చైతన్యానికి ఎంతో కృషిచేశారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో దాశరథి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నినదించిన దాశరథి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి డాక్టర్ లెంక సత్యనారాయణ, అధ్యాపకులు సమత, సాయిలు, సీతారాములు, రమేశ్, మహేందర్, శ్రీనివాస్, కృష్ణయ్య, గాయత్రీదేవి, నాగమణి, ఎడమ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలకు అంపశయ్య నవీన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

కేయూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు షురూ



పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శుక్రవారం పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ తదితర కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పలు విభాగాలను కేయూ వీసీ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిచారు. వీసీ వెంట పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్, ప్రిన్సిపాల్ టి.మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్య ఉన్నారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే..!



సంతోషిమాత దేవాలయంలో పూజ చేస్తున్న అర్చకుడు

శ్రావణమాసం ప్రారంభం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- మాసం మొత్తం ప్రతీ రోజు పండుగే..

హన్మకొండ కల్చరల్ : శ్రావణం.. శుభప్రదం. ఈ మాసంలో ప్రతీ రోజు పండుగే. ప్రతీ గడియ శుభకరమే. ప్రతీ తిథి శ్రేష్టమే. అందుకే ఈ మాసంలో చేపట్టిన ప్రతీ కార్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ క్రమంలో మహాశివుడికి ప్రీతికరణమైన శ్రావణ మాసం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయాల్లో ఉదయం నుంచే అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా పలు చోట్ల ఆలయాలను సుందరంగా అలంకరించారు. కాగా, శ్రీవిశ్వావసు నామ సంవత్సరం శ్రావణ శుద్ధ పాడ్యమి (శుక్రవారం) నుంచి శ్రావణ బహుళ అమావాస్య (ఆగస్టు 23వ తేదీ, శనివారం) వరకు శ్రావణమాసోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శ్రావణమాసం విశిష్టతపై 'సాక్షి' ప్రత్యేక కథనం

పూజల పండుగ..

శుద్ధ పంచమిరోజు నాగపూజలు, గరుడ పూజ, శుద్ధ పౌర్ణమి రోజు జంధ్యాలపున్నమిగా, రాఖీపౌర్ణమిగా, హైగ్రీవజయంతి, శ్రావణ బహుళ అష్టమిని శ్రీకృష్ణుని జన్మాష్టమిగా ఘనంగా జరుపుకుంటారు. బహుళ అమావాస్యను పొలాల అమావాస్యగానూ, అంధకారుడనే రాక్షసుడిని సంహరించిన రోజుగాను గోవులను, వృషభలను, పశువులను పూజించే రోజుగాను జరుపుకుంటారు.

ప్రతీరోజు ప్రత్యేకం..

శ్రావణమాసంలో సోమ, మంగళ, శుక్ర, శనివారాలను పవిత్రంగా భావించి ఈ రోజుల్లో నిష్ఠగా ఉంటారు. శ్రావణమాసంలోనే పోచమ్మ, మైసమ్మ తదితర స్త్రీ దేవతలకు,ఆది, బుధవారాల్లో బోనాలు జరుపుకుంటారు. శ్రావణసోమవారం శివుడికి ప్రీతికరమైనరోజు. అలాగే, శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయాలలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. మంగళవారం మంగళగౌరివ్రతాలు, గురువారం సాయిబాబా ఆలయాలలో అఖండసాయినామయజ్ఞాలు జరుగుతాయి. శ్రావణశుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరుపుకున్నవారికి పుణ్యంతో పాటు లక్ష్మీప్రసన్నం కూడా జరుగుతుందని, ధన,కనక, వస్తు, వాహనాలు చేకురుతాయని, పూర్వకాలంలో చారుమతిదేవి అనే మహిళ ఈ వ్రతాన్ని పాటించి సకల సంపదలు పొందిందని భక్తులు నమ్ముతారు.


వేయిస్తంభాల దేవాలయంలో ప్రతీ సోమవారం రుద్రాభిషేకాలు..

నగరంలోని చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో శ్రావణమాసోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీరుద్రేశ్వరశివలింగానికి మహాన్యాసపూర్వక ఏకాదశ జరుగుతుందని, అలాగే ప్రతీసోమవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, రుద్రాహోమాలు, అన్నపూజలు జరుగుతాయని ఆలయప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. జూలై 29న పంచమితిథిరోజు నాగపూజలు, ఆగస్టు 9న పౌర్ణమిరోజు రక్షాబంధనం, 16న శ్రీకృష్ణాష్టమి నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

దేవాలయాల్లో ఏర్పాట్లు..

శ్రావణమాసోత్సవాల సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని దేవాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా నగరంలోని చారిత్రక శ్రీభద్రకాళి దేవాలయంలో శ్రీభద్రేశ్వరశివలింగానికి ప్రతీసోమవారం ప్రత్యేక పూజలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రతీ శుక్రవారం అమ్మవారికి కుంకుమ పూజలు, ఒడిబియ్యం సమర్పణలు, నాగపంచమిరోజు దేవాలయ ఆవరణలో పుట్టవద్ద పూజలు నిర్వహిస్తారు. అలాగే, పద్మాక్షి దేవాలయం, వరంగల్ ఎంజీఎం ఎదుట గల శ్రీరాజరాజేశ్వరీదేవి దేవాలయం, హంటర్‌రోడ్‌లోని సంతోషిమాత ఆలయం, లష్కర్‌బజార్‌లోని సంతోషిమాత ఆలయాల్లో వరలక్ష్మీవ్రతాలు, వీటితో పాటు నగరంలోని పలు వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ శ్రావణ మాస పూజలు, పండితప్రవచనాలకు ఏర్పాట్లు చేశారు.

భద్రకాళి దేవాలయంలో శ్రావణ రద్దీ..



భద్రకాళి అమ్మవారు

హన్మకొండ కల్చరల్ : శ్రావణమాసం శుక్రవారం కావడంతో శ్రీభద్రకాళి దేవాలయాన్ని భక్తులు అధికసంఖ్యలో సందర్శించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఒడిబాల బియ్యం, చీరలు సమర్పించారు. ములుగు కలెక్టర్ దివాకర టి.ఎస్ కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే, తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులవల్లి వెంకటేశ్వర్లు, అకాడమీ మేనేజర్ శైలేశ్వర్‌రెడ్డి, అకాడమీ ఓఎస్‌డీ ఎంకే. రెహమాన్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు మహాదాశీర్వచనం అంజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పిన్న శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆలయ ఈఓ శేషుభారతి, ధర్మకర్త మండలి చైర్మన్ డాక్టర్ బండారు శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు వీరన్న, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, స్రవంతి, పూర్ణచందర్, ఆంజనేయులు, సతీశ్ పర్యవేక్షించారు.



భద్రకాళి దేవాలయంలో భక్తుల రద్దీ



ప్రకృతి పులకిస్తుంది..



శ్రావణ మాసంలో నిత్యం షోడశోపచార పూజలు, అగ్నిహోత్రంలో మూలికలు వేయడం ద్వారా వాతావరణంలో కాలుష్యం తగ్గుతుంది. ప్రకృతి పులకించి వర్షాలు పడతాయి. దేవాలయాలు సమాజ ఉన్నతికి, మానసిక పవిత్రతకు నిలయాలు.

-గంగు ఉపేంద్రశర్మ ప్రధానార్చకుడు, వేయిస్తంభాల దేవాలయం, హనుమకొండ

తీర్థంలో రోగనిరోధక శక్తి..



మానసిక, శారీరక సమస్యలతో సతమతమయ్యే వారికి ఆలయం ఓ వైద్యాలయం. దేవాలయాల్లో ఇచ్చే తీర్థంలో రోగ నిరోధక శక్తి ఉంటుంది. కీళ్ల వ్యాధులు నయమవుతాయి. గుడి చుట్టూ ప్రదక్షణలు చేయడంతో రక్తపోటు, కీళ్ల వ్యాధులు నయమవుతాయి. అందుకే గుడికి వెళ్లడం అలవాటు చేసుకోవాలి.

-ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి, ధర్మప్రవచకుడు, గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రం, హనుమకొండ

భగవంతుడిని పూజించడమే ఆధ్యాత్మికత..



ఉదయమే పూజలు చేయడం వల్ల మానసిక ప్రశాంతత పొందొచ్చు. భగవంతుడిని పూజించడం, దర్శించుకోవడం వల్ల ఆధ్యాత్మిక భావం పెంపొందుతుంది. భగవంతుడి దీక్ష తీసుకుని, స్మరణ చేస్తూ గడిపిన క్షణం ఒత్తిళ్లను, కష్టాలను అధిగమించే మానసిక స్థైర్యం పెరుగుతుంది.

-టీఆర్ బాలసుబ్రహ్మణ్యశర్మ, గురుస్వామి, శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం, వరంగల్

విద్యుత్‌స్తంభం పైనుంచి పడి కట్టర్ మృతి



బానోత్ రాజు (ఫైల్)

నర్మెట/జనగామ: విద్యుత్ స్తంభంపైనుంచి ప్రమాదవశాత్తు పడి ఓ కట్టర్ మృతిచెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా నర్మెట మండలంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దొంగల చెలిమితండాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో గురువారం రాత్రి 10 గంటల సమయంలో మరమ్మతు కోసం కట్టర్ బానోత్ రాజు అక్కడికి వెళ్లాడు. స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి సిబ్బంది 108 వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. భార్య నీల ఫిర్యాదు మేర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్సై చామకూరి వెంకటరెడ్డి తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే రాజు మృతి..

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మృతిచెందిన బానోత్ రాజు కుటుంబాన్ని విద్యుత్‌శాఖ, ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. రాజు మరణవార్త తెలుసుకుని ఏరియా ఆస్పత్రికి చేరుకున్న వారు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించడంతోపాటు భార్య నీలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో అజ్మీరా సురేశ్, దాసగోని సోము, కమలాకర్, లక్ష్మణ్, శ్రీను, సోమన్న, చిన్న, వెంకటేష్, సర్దార్ , సోమరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా సేవలందించాలి: సీపీ



సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న పదోన్నతి పొందిన ఎస్సైలు

హసన్‌పర్తి: ప్రజలకు నిజాయితీగా సేవలందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన శివకుమార్, నర్సయ్య, చంద్రమౌళి, శర్మ, సాంబయ్య శుక్రవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. సీపీ చేతుల మీదుగా పదోన్నతి పొందిన ఎస్సైల భుజాలపై నక్షత్రాలు అలంకరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే వారికి భరోసా కల్పించాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై గౌరవ, మర్యాదలు పెంపొందించాలన్నారు.

నూతన రికవరీ పాలసీ

- ఏడాది పొడవునా రుణాల జారీ, రికవరీ
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



మాట్లాడుతున్న రవీందర్‌రావు

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నూతన రికవరీ పాలసీ తీసుకొస్తున్నట్లు తెలంగాణ స్టేట్ కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పాలక మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్థిక లావాదేవీలు, రుణాల రికవరీ, మంజూరు, 2024–25 ఆడిట్ పురోగతిని సమీక్షించారు. ఈసమావేశానికి అధ్యక్షత వహించిన మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ.. వరంగల్ డీసీసీబీని ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు మరింత పట్టుదలతో పని చేయాలన్నారు. డీసీసీబీ ద్వారా ఏడాదంతా రుణాలు రికవరీ చేయడంతో పాటు కొత్త రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నాబార్డు డీడీఎం చంద్రశేఖర్, టెస్కాబ్ జీఎం లత, డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వజీర్ సుల్తాన్, జీఎం ఉషశ్రీ పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, రాజు, గంప స్రవంతి, కృష్ణ మోహన్, వైస్ చైర్మన్ కె. వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


గోదావరికి వరద తాకిడి..



కాళేశ్వరం పుష్కరఘాట్ తాకుతూ ప్రవహిస్తున్న వరద



వాజేడు: పూసూరు వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి



సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి చేరుతున్న వరద నీరు

- మేడిగడ్డకు 3.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కాళేశ్వరం వద్ద నీటిమట్టం 8.600 మీటర్లు

కాళేశ్వరం: మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత నీటితో గోదావరి నదికి వరద తాకిడి పెరిగింది. శుక్రవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో సరస్వతీఘాట్, మెయిన్ పుష్కరఘాట్లను తాకుతూ నీటిమట్టం ప్రవహిస్తోంది. 8.600 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు వెళ్తోంది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి 3.41 లక్షల క్యూసెక్కుల నీరు తరలివస్తోంది. మొత్తం 85 గేట్లు ఎత్తి అదేస్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరదనీటితో బ్యారేజీ జలకళ సంతరించుకుంది.

పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరి పరవళ్లు..

వాజేడు: మండలంలోని పేరూరు వద్ద గోదావరి నది నీటి మట్టం పెరుగుతోంది. గురువారం సాయంత్రం 9 మీటర్లు ఉన్న గోదావరి.. శుక్రవారం సాయంత్రానికి 13.24 మీటర్లకు చేరుకుంది. మంగళవారం నుంచి కురుస్తున్న వర్షాలకు వాగుల ద్వారా వచ్చిన వరదతో గోదావరి ప్రవాహం పెరుగుతోంది. పూసూరు బ్రిడ్జి వద్ద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది.

సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి భారీగా వరద నీరు..

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలోకి వరద నీరు భారీగా చేరుతోంది. మూడు రోజుల నుంచి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో బ్యారేజీలోకి వరద నీరు చేరుతుంది. దీంతో బ్యారేజీ ప్రాంతం వరదతో పరవళ్లు తొక్కుతోంది. శుక్రవారం ఎగువ నుంచి 3,71,400 క్యూసెక్కుల నీరు చేరడంతో బ్యారేజీ వద్ద 59 గేట్లలో నిన్నటి వరకు 8 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలిన అధికారులు.. శుక్రవారం మరో 16 గేట్లను ఎత్తి మొత్తం 24 గేట్ల ద్వారా 4,15,920 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద నీటి మట్టం 80.75 మీటర్లు కొనసాగుతోంది. బ్యారేజీ సామర్థ్యం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.80 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

అధ్వానం.. ఎంజీఎం అత్యవసర విభాగం

- సీఎంఓ నిర్లక్ష్యం.. పోస్టుమార్టం కోసం రెండు రోజుల నిరీక్షణ
- మెడికల్ లీగల్ కేసు నమోదు చేయకుండానే క్షతగాత్రుడికి చికిత్స



ఎంజీఎం : వరంగల్ ఎంజీఎం అత్యవసర విభాగం నిత్యం వివాదాస్పదంగా మారుతోంది. ఆస్పత్రిలో ఉదయం ఓపీ విభాగం ద్వారా 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సేవలందిస్తారు. అనంతరం క్యాజువాలిటీ అత్యవసర విభాగం ద్వారానే ప్రతీ రోగికి సేవలందుతాయి. ఓపీ సమయంలో సైతం ప్రాణపాయస్థితిలో ఉన్న రోగులకు క్యాజువాలిటీ ద్వారానే చికిత్స అందిస్తారు. వైద్యసేవల్లో ఇంత కీలకమైన అత్యవసర విభాగం పూర్తి అధ్వానంగా మారుతోంది. 24 గంటల పాటు ఆర్‌ఎంఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కాని స్థాయికి అత్యవసర విభాగం చేరుకుంది.

పోస్టుమార్టం కోసం రెండు రోజుల నిరీక్షణ.

జూన్ 15వ తేదీన చుక్క రాజయ్య(54) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో రాజయ్య కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తిరిగి క్షతగాత్రుడిని జూలై 20 తేదీన ఎంజీఎం తరలించారు. 23వ తేదీన రాత్రి మృతి చెందాడు. దీంతో సిబ్బంది.. రాజయ్య మృతదేహాన్ని మార్చరీకి తరలించగా ఆస్పత్రి క్యాజువాలిటీలో సీఎంఓ (క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్)గా విధులు నిర్వర్తిస్తున్న ఓ వైద్యుడు.. రాజయ్య కేస్‌షీట్‌పై ఎంఎల్‌సీ(మెడికల్ లీగల్ కేసు) నమోదు చేయకపోవడంతో ఫోరెన్సిక్ వైద్యులు పోస్టుమార్టం చేసేందుకు నిరాకరించారు. ఈ విషయం బయటకు రావడంతో క్యాజువాలిటీ వైద్యులు గురువారం మృతదేహానికి పోస్టుమార్టం జరిగేలా ఎంఎల్‌సీ నమోదు చేసేందుకు అన్ని సిద్ధం చేశారు. కాగా, ఈ సమయంలో కేస్‌షీట్ కనిపించకపోవడంతో గందరగోళం నెలకొంది. మృతుడికి సంబంధించిన కేస్ షీట్ ఆ సమయంలో విధులు నిర్వర్తించిన నర్సింగ్ ఆఫీసర్ దగ్గర ఉండడంతో సదరు ఉద్యోగికి ఫోన్ ద్వారా సమాచారం అందించి కేస్ షీట్ గుర్తించారు. హుటాహుటిన శుక్రవారం ఉదయం వైద్యులంతా హాజరై కేస్ షీట్‌లో ఎంఎల్‌సీ వివరాలు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతదేహం రెండు రోజులు పోస్టుమార్టం కాకుండా వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ విషయంపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంజీఎం పాలనాధికారులు పేర్కొన్నారు.

నరేశ్ మృతదేహం లభ్యం

కొత్తగూడ: చేపల వేటకు వెళ్లి వాగులో గల్లంతైన ఆగబోయిన నరేశ్(30) మృతదేహం లభ్యమైంది. మూడు రోజుల క్రితం చేపల వేటకు వెళ్లిన నరేశ్ వాగు ఉధృతిలో గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ ఎస్సై రవికుమార్, తహసీల్దార్ రాజు, మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ స్థానికుల సహకారంతో గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వరద ఉధృతి తగ్గడంతో సమీప పొలాల్లో మృతదేహం కనిపించగా పోస్టుమార్టం తరలించారు. కాగా, నరేశ్ ఆచూకీ కోసం నిర్విరామంగా కృషిచేసిన అధికారులు, స్థానిక యువకులను మంత్రి సీతక్క అభినందించారు. నరేశ్ కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.



నరేశ్(ఫైల్)

విజయమే లక్ష్యంగా ఆడాలి ..

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ స్పోర్ట్స్: ప్రతీ క్రీడాకారుడు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా అమ్యోచూర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోనెక్స్ సన్‌రైజ్ 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్–17 బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్‌లో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలకు సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి వరంగల్ ఖ్యాతి చాటాలన్నారు. గౌరవ అతిథి తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ యాదగిరిరావు మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదలతో పాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వరంగల్ ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. మహబూబాబాద్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మూల జితేందర్‌రెడ్డి, డాక్టర్ కొమ్ము రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరగనున్న పోటీలు వరంగల్ క్లబ్‌తో పాటు భీమారంలోని కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో కొనసాగుతాయని తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 20 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్, మేనేజర్లు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రమేశ్‌కుమార్, కార్యదర్శి పింగిళి రమేశ్‌రెడ్డి, కోశాధికారి నాగకిషన్, వరంగల్ క్లబ్ జాయింట్ సెక్రటరీ బి. కన్నారెడ్డి, నిమ్మ మోహన్‌రావు, టోర్నమెంట్ పరిశీలకుడు యూపీఎస్ బాబు, స్పాన్సర్లు నేరేళ్ల విజయ్, వద్దిరాజు వెంకన్న, అమరలింగేశ్వర్‌రావు, సురభి కిరణ్, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, రావుల మురళి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో ఉత్సాహం నింపిన సీపీ..

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ సీప సన్‌ప్రీత్‌సింగ్ తన అద్భుత ఆటతీరుతో క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కాగా, మొదటి రోజు వరంగల్ క్లబ్‌లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీలో 76 మ్యాచ్‌లు, కిట్స్ ఇండోర్ బాలుర సింగిల్స్, డబుల్స్ విభాగంలో 53 మ్యాచ్‌లు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్టీసీ బస్సుపై ఆకతాయి దాడి

- చాప్లాతండా సమీపంలో ఘటన



గాయాన్ని చూపుతున్న ఆర్టీసీ డ్రైవర్

డోర్నకల్: విద్యార్థులతో వస్తున్న ఓ ఆర్టీసీ బస్సుపై ఆకతాయి మద్యం సీసాతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చాప్లాతండా సమీపంలో జరిగింది. మహబూబాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం సాయంత్రం మండలంలోని చిలుకోడు మోడల్ స్కూల్‌కు చెందిన 138 మంది విద్యార్థులను తీసుకుని డోర్నకల్ బయలుదేరింది. ఈ క్రమంలో చాప్లాతండా సమీపంలో గుర్తుతెలియని ఆకతాయి బస్సు అద్దాలపై మద్యం సీసా విసిరాడు. దీంతో అద్దాలు పగిలి డ్రైవర్ యూసుఫ్ చేతికి గాయాలయ్యాయి. దాడితో అప్రమత్తమైన డ్రైవర్ సడన్ బ్రేక్ వేశారు. బస్సు నిలిచిన రోడ్డు పక్కన పెద్ద గుంత ఉండగా తృటిలో పెను ప్రమాదం తప్పింది. సమీప రైతులు బస్సు వద్దకు వచ్చి డ్రైవర్‌ను కిందికి దింపారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యాయి. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బస్సు డ్రైవర్ యూసఫ్, కండక్టర్ లక్ష్మీపతి తెలిపారు.

జలపాతాల వద్ద పర్యాటకుల సందడి..



పాండవుల జలపాతం వద్ద పర్యాటకుల కేరింతలు

బయ్యారం: మండలంలోని బయ్యారం పెద్దగుట్టపై ఉన్న పాండవుల జలపాతం, చింతోనిగుంపు జలపాతాల వద్ద శుక్రవారం పర్యాటకులు సందడి చేశారు. వర్షాలతో ఎత్తైన ప్రాంతాల నుంచి జారుతున్న జలపాతాల అందాలు చూసి ఫిదా అయ్యారు. అనంతరం జలపాత పరిసరాల్లో ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఎంజాయ్ చేశారు.